బాల్‌నగర్‌కు చెందిన మాజీ కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, నవాబ్‌పేట మండలంలోని కూచూర్‌కు చెందిన బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు పట్లోళ్ల నాగిరెడ్డి బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

నారాయణపేట టౌన్, జనవరి 1 : సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది. సమ్మెకు పీఆర్టీయూ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్సీలు కోదండరాం, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెను కొనసాగిస్తున్నారని తెలిపారు. సమ్మెకు పీఆర్టీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, తిప్పన్న, ఫజల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవగ్రహ రుద్ర హోమం..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జనవరి 1 : సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 23వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుతూ వేద మంత్రాలతో బ్రాహ్మణోత్తములతో నవగ్రహ రుద్ర హోమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ మనసు మారాలని, సానుకూల నిర్ణయం తీసుకొని న్యాయమైన డిమాండ్లను సీఎం వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వారధిగా ఉండి మధ్యవర్తిత్వం వహించి మా సమస్యలు మీరే పరిష్కరించాలంటూ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజామైనొద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవగ్రహ రుద్ర హోమం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

నారాయణపేట, జనవరి 1 : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని పీవైఎల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్, కోటకొండ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ మంగళవారం మండలంలోని కోటకొండలో పీవైఎల్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతరం వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే ఏదో ఒక క్రీడపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు గౌస్, చెన్నారెడ్డి, నారాయణ, నరసింహ, వెంకటప్ప, అంజి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కాశీనాథ్

రేపు జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలు

నారాయణపేట రూరల్, జనవరి 1 : జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 3, 4 తేదీల్లో జిల్లా స్థాయి బాల విజ్ఞాన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు డీఈవో గోవిందరాజులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, కోన్నత, ఉన్నత పాఠశాలలు ఇందులో పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించాలన్నారు. జూనియర్ విభాగంలో 1, సీనియర్ విభాగంలో 2 ప్రదర్శనలకు అనుమతి ఉంటుందన్నారు.

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- పాలమూరులో కిట కిటలాడిన కేసీఆర్ ఎకో పార్కు
- రంగులతో మురిసిన ముంగిళ్లు
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

ధన్వాడ మండలం ఎంనోనిపల్లిలో కూలీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న నాయకులు

నేతి కేకుతో జోష్

మరికల్ : కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

మహబూబ్‌నగర్, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలను మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ప్రజలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే యువతీ, యువకులు డ్యాన్స్‌లు, కేక్ కటింగ్‌లతో సందడి చేశారు. బుధవారం వేకువ జామునే ఇండ్ల ముంగిళ్లలో వివిధ రకాల ముగ్గులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ సమీపంలోని మయూరి కేసీఆర్ అర్బన్ ఎకో పార్కుకు సందర్శకులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. పిల్లలమర్రిలోనూ సందర్శకులు భారీగా తరలొచ్చి సందడి చేశారు. నూతనోత్సాహంతో నూతన సంవత్సరానికి గ్రాండ్‌గా వెల్‌కం చెప్పారు.

మరికల్ మండలంలో..

మరికల్, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలు మండల కేంద్రం తోపాటు వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. యువత కేక్ కట్ చేసి డ్యాన్స్‌లు, కేరింతలతో సందడి చేశారు.

నారాయణపేటలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నారాయణపేటలో..

నారాయణపేట రూరల్, జనవరి 1 : జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా కేంద్రం శివారులోని యాద్గీర్ రోడ్ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అయ్యప్పస్వామితోపాటు గణపతి, సుబ్రమణ్య స్వామి, వైష్ణవిమాతలకు ప్రత్యేక పూజలు చేశారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, జనవరి 1, నూతన సంవత్సర వేడుకలను జడ్చర్ల మండల ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్‌చేసి ఒకరికొకరు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కూలీలతో కలిసి వేడుకలు..

ధన్వాడ, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలను బుధవారం మండలంలోని ఏంనోనిపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు గౌని శ్రీనివాసులు పొలం వద్ద కూలీలతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అనిత, లక్ష్మమ్మ, వెంకటమ్మ, మంజుల, మణెమ్మ, కళమ్మ, శివమ్మ, ఎల్లమ్మ, మూకమ్మ, శివ, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్ మండలంలో..

ఊట్కూర్, జనవరి 1 : మండల కేంద్రం తోపాటు పలు గ్రామాల్లో న్యూ ఇయర్ వేడుకలను బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత ఉల్లాసభరితంగా జరుపుకొన్నారు. స్థానిక ఎంబీ సాలేమ్ చర్చిలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పీఏసీసీఎస్ కార్యాలయంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డికి రైతులు, సిబ్బంది మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో పాస్టర్లు జనార్దన్, బాల్‌రాం, పీఏసీసీఎస్ కార్యదర్శి హుస్సేన్ పాల్గొన్నారు.

ఊట్కూరు: సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డికి మిఠాయిలు తినిపిస్తున్న సిబ్బంది, రైతులు

ఆలయాల్లో పూజలు..

భూత్పూర్, జనవరి 1 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భూత్పూర్‌లోని శ్రీరామలింగేశ్వర స్వామి, అమిస్తాపుల్ శివారులోని శ్రీసాయి సచ్చిదానంద ఆశ్రమంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

హన్వాడలో..

హన్వాడ, జనవరి 1 : మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బాలాజీ ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

వెంకన్న ఆలయంలో..

పాలమూరు, జనవరి 1 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. అలాగే పట్టణంలోని కాటన్‌మిల్ వేంకటేశ్వరస్వామి, సింహగిరి లక్ష్మీ నరసింహస్వామి, టీచర్స్ కాలనీ రామాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సాంబశివుడు

ధన్వాడ, జనవరి 1 : ప్రభుత్వ లెక్చరర్స్ బీసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సాంబశివుడును ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. బుధవారం హైదరాబాద్‌లో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

బీమా కోరేగావ్ విజయ్ దివస్

నివాళులర్పిస్తున్న నాయకులు

కృష్ణ, జనవరి 1 : మండలంలోని హిందూ పుల్‌లో బీమా కోరెగావ్ విజయ్ దివస్ బుధవారం ఘనంగా నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1 జనవరి 1818 సంవత్సరంలో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మేటీల కార్యవర్గం ఎన్నిక

ఊట్కూర్, జనవరి 1 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మేటీల కార్యవర్గ కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా భీమశంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శిగా సీతారాంనాయక్, కార్యదర్శులుగా రాజు, మహేశ్, రామాంజనేయులు, బసిరెడ్డి ఎంపికయ్యారు.

తమిళనాడుకు పీయూ హాకీ జట్టు

పీయూ హాకీ జట్టుతో వీసీ మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాసులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 1: సౌత్‌జోన్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ హాకీ జట్టు బుధవారం తమిళనాడుకు బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా వీసీ మధుసూదన్‌రెడ్డి క్రీడాకారులకు ట్రాక్ సూట్, యూనిఫామ్స్ అందజేశారు. ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ జట్టు యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందని పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

కార్యక్రమంలో రవికుమార్, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, మేనేజర్ కిరణ్, కోచ్ సాగర్, నరేశ్‌తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో ప్రజలకు ముప్పు

మూసాపేట(అడ్డాకుల), జనవరి 1 : స్నేహ చికెన్ కోళ్ల పరిశ్రమ నుంచి వస్తున్న వర్థ్యాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్ గౌడ్ ఆరోపించారు. ఆయన బుధవారం అడ్డాకులలో స్నేహ పరిశ్రమ వ్యర్థాలు వస్తున్న పైపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడ్డాకులలో ఉన్న స్నేహ చికెన్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలును పైపుల ద్వారా బయటకు వదిలేస్తున్నారని చెప్పారు. వాటితో ప్రజలకు పలు వ్యాధులు వస్తున్నాయని, కాల్వ ద్వారా చెరువులోకి వెళ్లడం వల్ల చెరువు నీరు కలుషితమైపోతున్నట్లు ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కోళ్ల వ్యర్థాలు, పైపులను చూపిస్తున్న యుగంధర్‌గౌడ్

20 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

బాలానగర్/రాజాపూర్, జనవరి 1 : ఉమ్మడి బాలానగర్ మండల పరిధిలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో వాహనాలు నడిపించిన 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సైలు తిరుపాజీ, రవి తెలిపారు. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

10కేసులు నమోదు..

జడ్చర్లలో తనిఖీలు చేస్తున్న సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల, జనవరి 1 : జడ్చర్ల మున్సిపాలిటీలో డిసెంబర్ 31 రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో తనిఖీల్లో 10కేసులు నమోదైనట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశముందన్నారు. సురక్షితంగా వెళ్లేలా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

తపస్ జిల్లా కార్యదర్శిగా శేషప్ప

ఊట్కూర్, జనవరి 1 : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా కార్యదర్శిగా చిన్న పోల్స జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు శేషప్పను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ పాల్గొన్నారు.

పడకేసిన పంచాయతీ పాలన

- సమస్యలకు నిలయాలుగా మారిన విలేజ్‌లు
- ప్రత్యేకాధికారులున్నా ప్రయోజనం శూన్యం
- నిధులు లేక ముందుకు సాగని అభివృద్ధి పనులు
- ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించకపోవడంతో నోటీసులు
- పట్టించుకోని ప్రభుత్వం

సల్లోనిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

హన్వాడ, జనవరి 1 : గ్రామ పంచాయతీలు సమస్యలతో సతమతమవుతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన నాటి నుంచి ఎలాంటి పురోగతి లేదు. కనీసం పారిశుధ్య పనుల నిర్వహణ కూడా నిర్వహించలేని గ్రామాలు మండలంలో ఎన్నో దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకాధికారులను నియమించినా చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు తప్పా ఒరిగిందేమీ లేదని మండిపడుతున్నారు. అమ్మపూరం, ఎనిమిది తండా, నాగంబాయి తండా తోపాటు మరికొన్ని గ్రామ పంచాయతీలు ట్రాక్టర్ల ఈఎంఐలు కట్టకపోవడంతో నోటీసులు ఇచ్చారు. కేసీఆర్ హయాంలో పచ్చదనంతో కళకళలాడిన పల్లెలు నేడు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. కనీస సౌకర్యాలు వీధిలైట్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై పట్టింపులేక పోవడంతో నిత్యం ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగు నెలలుగా జీతాలు బంద్..

మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో పనిచేసే గ్రామ పంచాయతీ వర్కర్లకు నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 120 మంది గ్రామ పంచాయతీ వర్కర్లు పనిచేస్తున్నారు. చాలీచాలని వేతనాలు ఉండగా, అవి కూడా ఇవ్వకుంటే తమ కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నిస్తున్నారు.

నెలకు రూ.2లక్షల ఖర్చు..

హన్వాడ గ్రామ పంచాయతీకి ప్రతి నెలా రూ.2లక్షలు ఖర్చు అవుతుంది. గ్రామంలో ఏవైనా పన్నుల రూపంలో వసూలు చేసినా అరకొరగా పారిశుధ్య పనులకే ఖర్చవుతున్నాయి. ట్రాక్టర్ డీజిల్, మోటర్ల మరమ్మతులకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే సొంతంగా లక్షల్లో ఖర్చు చేయడం జరిగింది. నిధులు లేక పోవడంతో పనులు చేయలేకపోతున్నాం.

– దీప్తి, పంచాయతీ కార్యదర్శి, హన్వాడ

నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం..

ఏడాదిగా గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో పల్లెప్రగతి, వీధిలైట్లు, ట్రాక్టర్లకు డీజిల్, మోటర్ల మరమ్మతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంత మంది కార్యదర్శులు వారి సొంత ఖర్చులు పనులు చేయిస్తున్నారు. తండాల్లో ఉన్న ట్రాక్టర్లకు ఈఎంఐలు కట్టేందుకు డబ్బులు లేక పోవడంతో ఫైనాన్స్ వాళ్లు నోటీసులు పంపిస్తున్నారు.

– కృష్ణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ, హన్వాడ

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337305

WANTED
★ఒంటిగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివరించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748